ఆర్మూర్‌లో కుక్కలు, కోతుల బెడద

- వీధుల్లో సంచరిస్తూ, జనాలపై దాడులు చేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు


మహాలక్ష్మీకాలనీలో సంచరిస్తున్న కుక్కలు


ఆర్మూర్‌లోని కూరగాయల మార్కెట్‌లో కోతుల సమూహం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఓ వైపు కుక్కలు, మరో వైపు కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల తలుపు తీస్తే చాలు కోతులు లోనికి ప్రవేశించి వస్తువులను చిందరవందరగా పడేస్తున్నాయి. ఇంట్లో ఉన్న తినుబండరాలు, చిరు ధాన్యాలు పట్టుకుపోతున్నాయి. కోతులను బెదిరిస్తే తిరిగి దాడులు చేస్తున్నాయె తప్ప బయటకు వెళ్లడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇళ్లపై ఉంటూ ముప్పతిప్పలు పెడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కుక్కలు పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ విపరీతంగా పెరిగాయి. ప్రతి వార్డులో సుమారు 30నుంచి 40 కుక్కలు ఉన్నాయి. ఇటీవల అధికారులు ప్రతి వార్డులో వీధి కుక్కలపై సర్వే నిర్వహించగా సుమారు 1487 కుక్కలు ఉన్నట్లు అధికారులు చెపుతున్నారు. కుక్కల బెడదతో ప్రజలు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. చిన్నారులు ఆడుకోవాలన్న, పాఠశాలకు వెళ్లాలన్న ఎక్కడ కుక్కలు దాడి చేస్తాయోనని బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. రాత్రి సమయంలో కుక్కలు ద్విచక్రవాహనదారుల వెంటపడటంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. అటు కోతులు, ఇటు కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎవరూ కూడా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు కుక్కల సమస్య తీవ్రమైన ఇప్పటికై అధికారులు స్పందించి కుక్కల బెడదను తీర్చాలని కోరుతున్నారు.

మంగళవారం 9వ వార్డులో ఓ వ్యక్తిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. అలాగే పోచమ్మ కాలనీలో ఓ చిన్నారిపై బుధవారం ఉదయం కుక్కలు దాడి చేయడంతో చెవి, చేతిపై గాయాలు అయ్యాయి. దీంతో బాధిత కుటుంబ సభ్యులు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేశారు. హౌసింగ్‌బోర్డు విద్యానగర్ కాలనీ వాసులు సైతం కుక్కల బెడదను తీర్చాలని కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా మున్సిపల్ యంత్రాంగం, పాలకులు స్పందించి పట్టణంలో కుక్కలు, కోతుల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



మున్సిపల్ పరిధిలో కుక్కల, కోతుల బెడద తీవ్రంగా ఉన్నది వాస్తవమే. వాటిని త్వరలో జిల్లా కేంద్రంలోని ఏబీసీ కేంద్రానికి తరలించి వ్యాక్సినేషన్‌ను చేయిస్తాం. అలాగే సమస్యను ఉన్నతాధికారులతో చర్చించి వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

–రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్

కమ్మర్‌పల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్ సంకేత్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలకు సంబంధించి ప్రశ్నలను సంధించి సమాధానాలు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనంను పరిశీలించి మెనూ వివరాలను తెలుసుకున్నారు. అనంతరం హాసకొత్తూర్‌లోని పాలిహౌజ్‌లో సాగవుతున్న ఆర్కిడ్ పూల తోటను ఆయన పరిశీలించారు. పంట సాగు విధానం గురించి రైతు మోహన్‌నాయక్‌ను వివరాలడిగి తెలుసుకున్నారు. పంట ధర విషయమై ఒక్కోసారి గుత్తాధిపత్యం కొనసాగుతుందని, మార్కెటింగ్‌లో ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు రైతు వివరించారు. ప్రభుత్వం నుంచి మరింత సహకారం ఉంటే ఇంకా సాగు విస్తీర్ణం పెరుగుతుందని రైతులు అసిస్టెంట్ కలెక్టర్‌కు వివరించారు. ఎంఈఓ ఆంధ్రయ్య, ఉద్యానశాఖ అధికారి రాజు, రైతులు ప్రవీణ్, మనోహర్, మేడం రమేష్, కిషన్‌గౌడ్, మురళి, రఘు ఉన్నారు.

అమరవీరులకు ఘన నివాళి


బోధన్‌లో నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఆర్మూర్/నందిపేట్/బోధన్‌టౌన్/రెంజల్(బోధన్): ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో బుధవారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యంలో 'విద్యుత్ అమర వీరులకు' ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, వారి పోరాటాలను కొనియాడారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి సీఎం చంద్రబాబు పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో 'విద్యుత్ ఉద్యమం' నిర్వహించినట్లు తెలిపారు. కానీ ఉద్యమంపై పోలీసులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెందగా.. లాఠీ చార్జీలో అనేకమంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. నాటి ఘటనను గుర్తుచేసుకుంటూ మృతిచెందిన వారికి నివాళులు అర్పించామన్నారు. నాయకులు దేవారం, గంగాధర్, మల్లేష్ ఆయా మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో నివాళులు అర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు.. నందిపేటలో..

కొనసాగుతున్న ఎల్ఆర్ఎస్ సర్వే

రుద్రూర్: మండలంలో ఎల్ఆర్ఎస్ సర్వే చురుగ్గా కొనసాగుతుంది. బుధవారం ఇరిగేషన్ ఏఈ శృతి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నజీర్, పంచాయతీ సిబ్బంది మండల కేంద్రంలో పర్యటించి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలో 210 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 20 పరిశీలన పూర్తి చేసినట్టు అధికారులు వెల్లడించారు.

వైభవంగా శ్రీవారి పల్లకీసేవ



నవీపేట: మండల కేంద్రంలోని ధర్యాపూర్ కాలనీలో బుధవారం పురాతన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహానికి వీడీసీ ఆధ్వర్యంలో పల్లకీసేవ నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి మరుసటి రోజు వేంకటేశ్వరస్వామికి ఆనవాయితీగా ఈ పల్లకీసేవను నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

నిజామాబాద్‌అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఉద్యోగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం సంఘం ఆధ్వర్యంలో వారు నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చౌక్ వద్ద ధర్నా చేపట్టారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అశ్రఫ్, అంబదాస్, రాజన్న, నగేష్ గౌడ్, ప్రకాష్, విజయ్, గంగమణి, స్వప్న, రాణి, కవిత తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పాడి పరిశ్రమ లాభదాయకం



పెర్కిట్(ఆర్మూర్): తగు జాగ్రత్తలు పాటిస్తూ పాడి పరిశ్రమ చేపడితే లాభాదాయకంగా ఉంటుందని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బస్వారెడ్డి అన్నారు. పట్టణంలోని మండల సమాఖ్యలో పాడి పరిశ్రమ యూనిట్లకు ఎంపికైన 74 మంది ఆర్మూర్ మండల మహిళ సంఘాల సభ్యులకు స్త్రీనిధి ద్వారా బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్వారెడ్డి మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి పాడి గేదెలను కొనుగోలు చేసేటపుడు మోసపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే శాస్త్రీయ పద్ధతిలో పాడి పరిశ్రమను ఎలా చేపట్టాలో తెలియజేశారు. దీంతోపాటు పాల దిగుబడి ఎక్కువగా రావడానికి నిత్యం 60శాతం పచ్చిగడ్డి, 40 శాతం ఎండుగడ్డిని దాణాగా ఇవ్వాలన్నారు. అలాగే పశు సంవర్ధక శాఖ వారి సూచనల మేరకు విధిగా టీకాలు వేయించాలన్నారు. మండల పశు సంవర్ధకశాఖ అధికారి లక్కం ప్రభాకర్, ఐకేపీ ఏపీఎం గంగారాం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

హెల్మెట్లను ధరించాలి



ఎడపల్లి(బోధన్) : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలని పోలీసులు సూచించారు. మండలంలోని సాటాపూర్ గేట్ వద్ద బుధవారం వాహనదారులకు, యువకులకు బుధవారం ఎడపల్లి పోలీస్ శాఖఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ఇలియాస్ సైబర్ నేరాలు, హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటీపీ నెంబర్లు గుర్తు తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని మొబైల్ ఫోన్లను ఎవరికి ఇవ్వవద్దన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు.

ముప్కాల్‌లో ఫీవర్ సర్వే



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో బుధవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది ఇళ్లలోని వారి వివరాలను, వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలను నమోదు చేశారు. ఎక్కువగా జ్వరంతో బాధపడుతున్నవారికి మందులను అందజేశారు. సర్వేను ఎంపీవో గౌస్‌మోహీనొద్దీన్ పర్యవేక్షించారు. హెల్త్ సూపర్ వైజర్ పద్మ, సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి



మోర్తాడ్: దేశంలో మహిళలు, ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని కోరుతూ బుధవారం మోర్తాడ్‌లోని సంస్కృతి పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. దేశ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులపై నిరసన తెలిపారు. విద్యార్థి దశ నుంచి మహిళలు స్వీయ రక్షణ కోసం శిక్షణ తీసుకోవాలని అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట రుణాలను సకాలంలో చెల్లించాలి



మోర్తాడ్: సహకార సంఘాల ద్వారా పంట రుణాలను తీసుకున్న సభ్యులు సకాలంలో చెల్లించి ప్రభుత్వం ఇచ్చే వడ్డీ రాయితీని పొందాలని ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ సహకార సంఘం చైర్మన్ పెద్దకాపు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. 52 మంది రైతులకు బుధవారం ఆయన రూ.49.75లక్షల పంట రుణాలు పంపిణీ చేశారు. రుణమాఫీ జరిగిన రైతులకు సకాలంలో కొత్త రుణాలను మంజూరు చేసిన డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుడు దేశబోయిన సంజీవ్, నాయకులు సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎర్ర శశిధర్, వెంకన్నగారి శ్రీనివాస్, మద్దెల ముత్తెన్న, కార్యదర్శి ఎర్రాజు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



భీమ్‌గల్: మండలంలోని పల్లికొండ గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో సంతోష్ కుమార్ బుధవారం పరిశీలించారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. వర్షకాలం నేపథ్యంలో దోమలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జీపీ కార్యదర్శికి సూచించారు.

రైతు కుటుంబాల నిర్ధారణ ప్రారంభం


ఆలూర్‌లో వివరాలు సేకరిస్తున్న అధికారులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్‌తోపాటు ఆలూర్ మండలంలో రుణమాఫీ కాని వారి కుటుంబాల నిర్ధారణ నమోదు కార్యక్రమాన్ని బుధవారం వ్యవసాయశాఖ అధికారులు ప్రారంభించారు. ఆర్మూర్ మండలం పిప్రితోపాటు ఆలూర్ మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతుల కుటుంబాల ధ్రువీకరణను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. అలాగే పాసు పుస్తకం లేని వారి, పాసు పుస్తకం భర్త పేరుతో ఉండి భార్య పేరుతో రుణాలు పొందిన వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. ఏఈవో వసుదాం, రైతులు పాల్గొన్నారు.

రుణ మాఫీపై నేటి నుంచి ఇంటింటి సర్వే

వేల్పూర్: మండలంలో పంట రుణాలు మాఫీ వర్తించని రైతు కుటుంబాలను గుర్తించడానికి గురువారం నుంచి ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి శృతి ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డు లేకుండా రుణమాఫీ రాని కుటుంబాలను మొబైల్ యాప్‌లో గ్రూపింగ్ చేయడం జరుగుతుందన్నారు. 29న మోతె, 30న వెంకటాపూర్, కుకునూర్, కోమన్‌పల్లి, 31న వేల్పూర్, సెప్టెంబరు 2న జాన్కంపేట్, సాహెబ్‌పేట్, 3న అక్లూర్, 4న రామన్నపేట్, 5న అంక్సాపూర్, 6న కొత్తపల్లి, వాడి, 9న పచ్చలనడ్కుడ, 10న పడగల్, పోచంపల్లి, 11న అమీనాపూర్, లక్కోర గ్రామాలలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

దివ్యాంగులపై చిన్నచూపు తగదు



రెంజల్(బోధన్)/నవీపేట : రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులపై చిన్నచూపు చూడటం సరికాదని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ అన్నారు. రెంజల్ మండలంలోని దూపల్లిలో, నవీపేట్ మండల కేంద్రంలో బుధవారం వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె జెండావిష్కరణ చేసి, మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి వికలాంగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాక్‌లాగ్ పోస్టులను వికలాంగుల కోటాలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాల్లో వికలాంగుల కోటాను నిర్ణయించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. నాయకులు కర్ల గంగాధర్, భూమయ్య, అబ్బయ్య, సాయిలు, పోశెట్టి, స్వరూప, మానికొల్ల గంగాధర్, బయ్య సతీష్, షంషొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి శ్రామికనగర్‌లో బుధవారం పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డివిజన్ ప్రతినిధులు మహమ్మదీ, ఫరానాలు మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఈ నెల 31న నిర్వహించే పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభలకు మహిళలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సంఘ సభ్యులు హైమది, భాను, సుల్తానా, రాజమణి, గంగు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నిజమాయే!



ధర్మారం శివారులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు.. నూతన గృహంలో పూజలు నిర్వహిస్తున్న లబ్ధిదారులు

ఎడపల్లి(బోధన్): మండలంలోని ధర్మారం గ్రామంలో పేదల సొంతింటి కల నిజమయింది. గ్రామ పొలిమేరలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ఇటీవల అధికారులు లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి, ఇళ్లను అందజేశారు. దీంతో బుధవారం గ్రామంలోని ఇళ్లు లేని 30 పేద కుటుంబాలు వారికి కేటాయించిన ఇళ్లలో గృహప్రవేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినంతలోనే ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి స్పందించి, ఇళ్లను అందించడంతో పేదలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ.. ఇళ్లలో ఆయన ఫోటోను అలంకరించుకున్నారు. తమ జీవితకాల స్వప్నం నెరవేరిందని లబ్ధిదారులు పేర్కొన్నారు. ఇళ్ల పంపిణీలో మాజీ సర్పంచులు సున్నం నరసయ్య, గౌండ్ల సావిత్రి ప్రధాన కారణమని అన్నారు.

సంక్షిప్తం

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

రుద్రూర్: ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంపై బీఆర్ఎస్ నేతలు బుధవారం మండల కేంద్రంలో సంబురాలు నిర్వహించారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

ఎమ్మెల్సీ కవితకు బోధన్ నాయకుల స్వాగతం

బోధన్‌టౌన్(బోధన్): ఎమ్మెల్సీ కవితకు బుధవారం శంషాబాద్ ఏయిర్‌పోర్టులో బోధన్ బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు. కవితక్క రాకతో పార్టీలో నూతనుత్తేజం వస్తుందని, పార్టీ బలోపేతాకిని కృషి చేస్తామని పోస్టర్లు ప్రదర్శించారు. నాయకులు మధు, శ్రీనివాస్, దేవా అన్నారు.

యువకుడికి ఉచితంగా కంటి ఆపరేషన్

రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లిఫారంకు చెందిన రామ్‌చందర్‌కు ఒకే కన్ను పనిచేస్తుంది. ఈ కన్నుకు కాటరాక్ట్ కంటి ఆపరేషన్ తప్పనిసరి కావడంతో కోటగిరి లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించారు. క్లబ్ ప్రతినిధులు రవికుమార్, హనుమంత రావు పటేల్, సంతోష్, యోగేష్, శ్రీకాంత్ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

బాల్కొండ: ముప్కాల్‌కు చెందిన కంచురాము గతంలో కరోనాతో మృతి చెందగా,ఆయన భార్య లావణ్య ఈమధ్య గుండెపోటుతో మృతి చెందింది. దీంతో వారి ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు. బాధిత కుటుంబానికి బుధవారం ముప్కాల్ జెడ్పీహెచ్ఎస్ 1992–93 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ.85వేలను అందజేశారు. రమేశ్, రాంరాజు, ఉమేష్ ఆనంద్, దయానంద్,రాజాశేఖర్,భూమేశ్ ఉన్నారు.

బీజేపీ ముప్కాల్ అధ్యక్షుడిగా గంగాధర్

బాల్కొండ: ముప్కాల్‌లో బుధవారం నిర్వహించిన బీజేపీ సమావేశంలో ముప్కాల్ ప్రెసిడెంట్‌గా పెంటు గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే శక్తి కేంద్ర ఇన్‌చార్జిగా మ్యాక నర్సయ్య, టౌన్ యూత్ ప్రెసిడెంట్‌గా రాథోడ్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. పార్టీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కు నర్సయ్య పాల్గొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పదోన్నతులు పొందిన సంఘం ప్రాథమిక సభ్యులను పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సన్మానించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు బాలచంద్రు, సలీం, కిశోర్, శ్రీనివాస్‌రావు, యూసుఫ్, ప్రసాద్, శ్రీనివాస్, వహీద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడీఏకు సన్మానం



మోర్తాడ్: భీమ్‌గల్ ఏడీఏ కాలువ మల్లయ్య బదిలీ కావడంతో బుధవారం ఆయనకు సిబ్బంది సన్మానం చేశారు. అలాగే కొత్తగా వచ్చిన ఏడీఏ శ్రీనివాస్‌కు బాధ్యతలను అప్పగించారు. మల్లయ్య సిద్ధిపేట్ జిల్లా గజ్వేల్‌కు బదిలీ అయినట్లు తెలిపారు.

పారిశుధ్య సమస్యను పరిష్కరించాలి

రుద్రూర్: గ్రామాల్లో పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని ఆర్ఎస్‌పీ (రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ) జిల్లా కార్యదర్శి యార్లగడ్డ సాయిబాబా కోరారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేకాధికారుల పాలనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు బాలు తదితరులు ఉన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లు అర్హులకే ఇవ్వాలి

ఎడపల్లి: మండలంలోని ధర్మారం గ్రామంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను అర్హులకు అందించాలని గ్రామస్తులు కోరారు. అనర్హులకు ఇచ్చారని ఆరోపిస్తు గ్రామానికి చెందిన హేమలత, గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ ధన్వాల్‌కు విన్నవించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



బాల్కొండ: మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్ రెడ్డి, అసోషియేటెడ్ అధ్యక్షుడిగా గోపి, కార్యదర్శిగా రాజేశ్వర్, మహిళ విభాగం అధ్యక్షురాలిగా విద్య ఎన్నికయ్యారు.

రుద్రూర్: మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విఠల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండీ దస్తగిరి, కార్యదర్శిగా రాములు, మహిళ ఉపాధ్యక్షురాలిగా శిరీష, అసోసియేట్ అధ్యక్షుడిగా వీరేశం ఎన్నికయ్యారు.

సభ్యత్వ నమోదు వేగంగా పూర్తిచేయాలి



మోర్తాడ్: బీజేపీ సభ్యత్వ నమోదును సకాలంలో వేగంగా పూర్తిచేయాలని పార్టీ మండల అధ్యక్షుడు ఏలేటి నారాయణరెడ్డి సూచించారు. ఏర్గట్లలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు చేశారు. నాయకులు మల్కన్నగారి మోహన్‌రెడ్డి, కొండ ఘణశ్యామ్, అయోధ్య నర్సయ్య, గడ్డం శ్రీనివాస్, గంగేశ్వర్, విఠల్ పాల్గొన్నారు.

దొంకేశ్వర్ మండలకేంద్రంలో..



దొంకేశ్వర్(ఆర్మూర్) : మండల కేంద్రంలో బుధవారం భారతీయ జనతా పార్టీ సభ్యత్వ కార్యశాల సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పోతుగంటి సురేందర్, బీజేపీ జిల్లా కార్యదర్శి గంగోలి సంతోష్ కుమార్ సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదు గురించి పార్టీ శ్రేణులకు వివరించారు. నాయకులు సాగర్, గంగారెడ్డి, మోహన్, రాజేశ్వర్, మహేశ్, ముత్యం, బాబురావు, తదితరులున్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 –	డిమోంటి కాలనీ (తెలుగు) – 10.00, 7.35, మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) – 1.05, తంగలాన్ (తెలుగు) 4.15, స్త్రీట్-2 (హిందీ) 10.40
స్క్రీన్-2 –	సరిపోదా శనివారం (తెలుగు)– 11.30, 3.00, 6.00, 10.00
స్క్రీన్-3 –	ఆయ్ (తెలుగు) – 12.05, కమిటీ కుర్రోళ్లు (తెలుగు) – 3.10, 9.30
స్క్రీన్-4 –	సరిపోదా శనివారం (తెలుగు)– 11.00, 2.30, 6.00, 9.30

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతాఏషియన్) నిజామాబాద్

స్క్రీన్-1	ఆయ్ (తెలుగు) – 10.20, 4.20, 10.30 తంగలాన్ (తెలుగు) 1.20, 7.20
స్క్రీన్-2	డిమోంటి కాలనీ-2 (తెలుగు) – 10.25, 10.20, స్త్రీట్-2 (హిందీ) – 1.30, కమిటీ కుర్రోళ్లు (తెలుగు)–4.30 మారుతీనగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) – 7.30
స్క్రీన్-3	స్త్రీట్-2 (హిందీ) – 10.20, 10.20, మారుతీనగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) – 1.20, డిమోంటి కాలనీ-2 (తెలుగు) – 4.20, డబుల్ ఇస్మార్ట్ (తెలుగు) 7.10

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్) నిజామాబాద్

స్క్రీన్-1	స్త్రీట్-2 (హిందీ) –10.00, 4.30, 10.50, కమిటీ కుర్రోళ్లు (తెలుగు) – 1.15, 7.45
స్క్రీన్-2	ఏలియన్ రోములస్ (తెలుగు) – 10.15, ఆయ్ – 1.00, తంగలాన్ – 4.05, స్త్రీట్ -2 (హిందీ) – 7.25, మారుతీనగర్ సుబ్రహ్మణ్యం – 10.40
స్క్రీన్-3	డిమోంటి కాలనీ-2 (తెలుగు) – 10.20, 4.40, 10.30, స్త్రీట్-2 (హిందీ) – 1.25, ఏలియన్ రోములస్ (ఇంగ్లీష్) – 7.45
స్క్రీన్ -4	వెడింగ్ డైరీస్ (తెలుగు)–10.55, మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం (తెలుగు) – 1.35, 7.40, రేవు (తెలుగు)–4.45, ఇంద్ర (తెలుగు) – 10.50
దేవి	తంగలాన్ (తెలుగు)
నటరాజ్	కమిటీ కుర్రోళ్లు (తెలుగు)
విజయ్	మిస్టర్ బచ్చన్ (తెలుగు)
లలితామహాల్	డబుల్‌ఇస్మార్ట్ (తెలుగు)

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,600	వెండి (కిలో)	90,500
22 క్యారెట్స్	68,635		

– నిజామాబాద్ బిజినెస్